క్లుప్తంగా

కానూరులో దేవినేని నెహ్రూ వర్ధంతి



పెనమలూరు: దివంగత మాజీ మంత్రి దేవినేని రాజశేఖర్(నెహ్రూ) వర్ధంతి కానూరులో బుధవారం చేశారు. వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు, కానూరు మాజీ సర్పంచి అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి నెహ్రూ ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవినేని నెహ్రూ మంత్రిగా, ఎమ్మెల్యేగా ప్రజలకు అనేక సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, నేతలు పిడికిటి రామకోటేశ్వరరావు, అయూబ్‌ఖాన్, విజయ్‌కుమార్, దామోదరరావు, చాంద్‌బాషా, లతీఫ్, వేమూరి బాలకృష్ణ, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నున్నలో పేరంటాలమ్మ తిరునాళ్ల

నున్న(విజయవాడరూరల్): స్వస్తిశ్రీ చాంద్రమానేన శ్రీ క్రోధి నామ సంవత్సరం చైత్ర శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం నుంచి 23వ తేదీ వరకు నున్న గ్రామ పేరంటాలమ్మ తిరునాళ్ల మహోత్సవాలు జరుగునని నిర్వాహక కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. శుక్రవారం ఉదయం మాను పూజ, సాయంత్రం దేవతామూర్తులైన గోపిరెడ్డి -పార్వతమ్మ, చింతయ్య-వీరమ్మ, రామిరెడ్డి-నాగమ్మ పేరంటాళ్ల ఊరేగింపు జరుగుతుంది. 20, 21 తేదీల్లో కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 22న అంకమ్మతల్లి జీవిత చరిత్ర ఆలపించడం, పోటు గొర్రె కార్యక్రమం జరుగును. 23న ధూపదీప నైవేద్యములు, సాయంత్రం బోనాలు, 7 గంటలకు మేళతాళాలతో సిడిబండి ఊరేగింపు, 10 గంటలకు ఊయల కార్యక్రమం జరుగును. గ్రామ పేరంటాళ్లమ్మ తిరునాళ్లకు సంబంధించిన పూజా కార్యక్రమాల్లో గ్రామ ఆడపడుచులు పాల్గొనాలని కమిటీ విజ్ఞప్తి చేసింది.

మద్యం షాపు ఉద్యోగిపై దాడి

పెనమలూరు: గోసాల ప్రభుత్వ మద్యం షాపులో పని చేసే వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేయడంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం గోసాల మద్యం షాపులో కంకిపాడుకు చెందిన చిలుకూరు సాయిగోపాల్ సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. అయితే కంకిపాడుకు చెందిన ఎస్.నాగరాజు, ధర్మతేజ వచ్చి మద్యం అడిగారు. వారు అడిగిన మద్యం బ్రాండ్ లేకపోవడంతో ఆగ్రహంతో సాయిగోపాల్‌పై దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఎన్డీయే కూటమిని ఓడించండి

పెనమలూరు: ఎన్డీయే కూటమిని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని ఏపీపీసీసీ ఉపాధ్యక్షుడు ధనేకుల మురళీమోహన్‌రావు కోరారు. పెనమలూరు గ్రామంలో బుధవారం ఇండియా కూటమి పెనమలూరు నియోజకవర్గ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తొలుత పెనమలూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వెలిశిల సుబ్రహ్మణ్యంను పరిచయం చేశారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో ఎన్డీయే పాలనతో పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలు ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నాయన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే కూటమిని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. వామపక్ష నేతలు పంచకర్ల రంగారావు, మున్నంగి నరసింహారావు మాట్లాడుతూ ఎన్డీయే కూటమిని తరిమి కొట్టాల్సిన సమయం వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో పలువురు ఇండియా కూటమి నేతలు పాల్గొన్నారు.

విజయవాడలో ఎగ్జిబిషన్ ప్రారంభం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి బైపాస్ రోడ్ పక్కన, సితార సెంటర్ సమీపంలోని విద్యాధరపురం లేబర్ కాలనీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్‌ను బుధవారం సాయంత్రం నిర్వాహకులు గరిమెళ్ల విద్యాశ్రీ, నానయ్య చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైపూర్ పింక్ ప్యాలెస్ నమూనా ముఖద్వారంతో ఎంతో ఆకర్షణీయంగా ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. వేసవి కాలంలో పిల్లలు, పెద్దలకు సాయంత్రం సమయంలో అహ్లాదకరమైన వాతావరణంలో ఆటవిడుపుగా ఉంటుందని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం ఆరు నుంచి 10 గంటల వరకు ఉండే ఈ ఎగ్జిబిషన్‌లో జైంట్ వీల్, మేరి కొలంబస్, బ్రేక్ డాన్స్, డ్రాగన్ ట్రైన్, ఇండియన్ టోరా టోరా, ఇటాలియన్ ఐటెమ్స్ వంటి ప్రత్యేకమైన ఆట వస్తువులు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే బెడ్ షీట్స్, బెంగాలీ కాటన్ శారీస్, లక్నో శారీస్, నైటీస్, హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ స్టాల్స్‌తోపాటు అనేక రకాల ఫుడ్ స్టాల్స్‌కూడా ఎగ్జిబిషన్‌లో ఉన్నాయని వివరించారు. ప్రతి రోజూ సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు.

కనులపండువగా శ్రీసీతారాముల కల్యాణం

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- పలు చోట్ల అన్నప్రసాద వితరణ



కంకిపాడులో సీతారాముల స్వామివారికి పూజలు చేస్తున్న మంత్రి జోగి రమేష్



నున్న తూర్పు రామాలయంలో శ్రీ సీతారాములస్వామివారు



ఎనికేపాడులో సీతారామస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఈడుపుగల్లులో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



యనమలకుదురులో సీతారాములస్వామివారు



హనుమాన్‌జంక్షన్‌లో సీతారాముల కల్యాణం



పెనమలూరులో సీతారాముల స్వామివారి కల్యాణం తిలకిస్తున్న భక్తులు



దావాజిగూడెంలో స్వామివారి కల్యాణం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రసాదంపాడు రామాలయంలో గొల్లపూడి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, దీప్తి దంపతులు రాములోరి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఎనికేపాడు శ్రీసీతారామస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదం అందజేశారు.

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీసీతారామస్వామివారి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు. శ్రీసీతారాముల కల్యాణం కనులపండువగా జరిగింది. స్వామివారి కల్యాణం అనంతరం అన్నసమారాధన చేశారు. తాడిగడప రామాలయంలో మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతి సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో శ్రీసీతారాముల కల్యాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ధార్మికపరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు దంపతులు, ఈఓ బి.గంగాధరరావు, ఆలయ ప్రధాన అర్చకుడు సాగర్ పాల్గొన్నారు. పెదపులిపాక శ్రీవిజయ రాజరాజేశ్వరి ఆలయంలో శ్రీవాసుదేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యాన శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. వణుకూరు, కానూరు, యనమలకుదురు రామాలయాల్లో శ్రీరామనవమి పండుగను భక్తిశ్రద్ధలతో చేశారు.

పోరంకిలో..

పోరంకి శ్రీనగర్‌కాలనీలోని శ్రీకోదండ రామాలయంలో కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ నెల 21వ తేదీన భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు వై.రాధాకృష్ణమూర్తి తెలిపారు.

నవమి వేడుకల్లో మంత్రి ప్రత్యేక పూజలు..

కంకిపాడు: ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామనవమి సందర్భంగా కంకిపాడు, పునాదిపాడు గ్రామాల్లో నవమి వేడుకల్లో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులతో మాట్లాడి అన్నప్రసాదం, పానకం పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గన్నవరం: శ్రీరామనవమి పర్వదిన వేడుకలను గన్నవరం ప్రాంతంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి తిరుకల్యాణం ఘనంగా జరిగింది. సుప్రభాతసేవ, శ్రీసీతారాముల ఎదుర్కోలు ఉత్సవం అనంతరం రక్షాబంధనం, నవగ్రహ ఆరాధన, కన్యాదానం సుముహూర్తంలో మాంగల్యధారణ చేశారు. సాయంత్రం రథంపై స్వామివారికి శోభయాత్ర నిర్వహించారు. స్థానిక మూడుబొమ్మల సెంటర్‌లో పట్టణ వర్తక సంఘం ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా చేశారు. పాతగన్నవరంలోని శ్రీభద్రాద్రి రామాలయం, స్థానిక గౌడపేట, యాదవులపేట, సగర్లపేట, రజక రామాలయాల్లో స్వామివారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు.

కంకిపాడు: శ్రీరామనవమి సందర్భంగా బుధవారం మండలంలోని కంకిపాడు, ఈడుపుగల్లు, మద్దూరు తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని సాంప్రదాయబద్ధంగా చేశారు. అనంతరం పానకం, వడపప్పు పంపిణీ చేశారు. కంకిపాడు రైతుబజారులో దుకాణదారులు నవమి వేడుకలు జరుపుకొని పూజలు చేయించారు. ఈడుపుగల్లు డాము సెంటరులో పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు వీరమాచనేని శ్రీనివాసరావు, నకరికంటి శేఖర్, పుప్పి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడరూరల్: నున్న గ్రామం తూర్పు రామాలయంలో బుధవారం శ్రీ కోదండరామస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం ఘనంగా జరిగింది. ఉభయదాతలు భీమవరపు లోకేష్‌రెడ్డి దంపతులు, భీమవరపు విజయభాస్కరరెడ్డి కల్యాణం జరిపించారు. పడమర శ్రీరామాలయంలోనూ, హైస్కూల్ సెంటర్లోని శ్రీరామాలయం నందు సీతారాముల కల్యాణం జరిగింది. బోడపాడు, మంగళాపురం, పి.నైనవరం, అప్పారావుపేట గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. సూరంపల్లి రామాలయంలో పీటలపై కూర్చుని కల్యాణం చేసిన దంపతులకు ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కరుణ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య దంపతులు నూతన వస్త్రాలు అందజేశారు. ముస్తాబాద రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణ ఉత్సవంలో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి పాల్గొన్నారు. తెంపల్లి, వీరపనేనిగూడెం, గొల్లనపల్లి, చిక్కవరం, సావరగూడెం, పురుషోత్తపట్నం, గోపవరపుగూడెం తదితర గ్రామాల్లో కల్యాణోత్సవాలు జరిగాయి.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ నెరుసు భూషణం, వడ్డి త్రివేణికుమార్, గంగాధరరావు దంపతులు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలో సీతారామ భక్తబృందం ఆధ్వర్యాన అన్నప్రసాద వితరణ చేశారు. వాసవి క్లబ్, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జంక్షన్ సెంటర్‌లో పానకం పంపిణీ చేశారు. వీరవల్లిలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. లక్ష్మీతిరుపతమ్మ తల్లి దేవస్థానం సెంటర్‌లో మమతల పందిరి సేవా సమితి ఆధ్వర్యంలో పానకం పంపిణీ చేశారు.

సీఎం జగన్‌ను మరోసారి గెలిపించండి

మంత్రి జోగి రమేష్




పెనమలూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: ప్రజా ప్రభుత్వం రావాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. పెనమలూరు గ్రామంలో బుధవారం మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కోరిన విధంగానే జగనన్న పాలన చేసి అనేక సంక్షేమ పథకాలు పేదలకు అమలు చేశారన్నారు. అక్కచెల్లెమ్మలకు ఇళ్లు ఇచ్చి గృహ యజమానులను చేశారని తెలిపారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆనందంగా ఉండాలంటే తిరిగి జగనన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందని అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు రద్దు చేసి పేద, మధ్య తరగతి ప్రజలను రోడ్డున పడేస్తాడని ఆరోపించారు. చంద్రబాబు కేవలం పెత్తందారులు, బడా వ్యక్తులకు మాత్రమే పని చేస్తాడని పేదలంటే అతనికి చులకన అని విమర్శించారు. చంద్రబాబు అండ్‌కోను ప్రజలు తిప్పకొట్టి జగనన్నను తిరిగి సీఎంను చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు, సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ సుష్మా, నేతలు శీలం శ్రీరాములు, మాదు శ్రీనివాసరావు, శివ, కె.మాణిక్యాలరావు, సుమతి, అజయ్, ప్రకాష్, మరీదు సాంబశివరావు, జగన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: ఆర్థిక బాధలతో కానూరులో వ్యక్తి అదృశ్యం అయిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్‌కు చెందిన దావూద్‌బాషా ఆటోనగర్‌లో స్క్రాప్ వ్యాపారం చేస్తాడు. అతను వ్యాపారం కోసం బ్యాంకుల్లో లోన్ తీసుకున్నాడు. లోన్ తీర్చకపోవడంతో ఒత్తిడి పెరిగింది. కాగా ఈ నెల 15వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన దావూద్‌బాషా తిరిగి రాలేదు. దీంతో అతని కుమారుడు ఆసీఫ్ తండ్రికి ఫోన్ చేయగా వేరే ఒక వ్యక్తి ఫోన్‌లో మాట్లాడుతూ కృష్ణలంక మసీదు వద్ద ఫోన్, బైక్ ఉందని వ్యక్తి కనబడలేదని సమాధానం చెప్పాడు. దీంతో మసీదు వద్దకు కుటుంబ సభ్యులు వెళ్లి బైక్, ఫోన్ తీసుకున్నారు. దావేద్ బాషా కోసం వెతికినా అతని ఆచూకీ తెలియలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ శ్రీ కోదండ రామాలయంలో బుధవారం సాయంత్రం శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. జంగం విజయకుమార్ శిష్యబృందం భక్తి కీర్తనలకు అనుగుణంగా చేసిన నృత్యాలు చూపరులను అలరించాయి. చిన్నారుల నృత్య ప్రదర్శన చక్కటి హావభావాలతో ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు, కళాభిమానులు పాల్గొని చిన్నారుల ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు కాటూరి వీరరాజు, కార్యదర్శి గంగిశెట్టి సాంబశివరావు, కె.సాంబశివరావు, డి.రామారావు పర్యవేక్షించారు.

సక్రమంగా నామినేషన్లు దాఖలు చేయాలి

రిటర్నింగ్ అధికారి రాజు

పెనమలూరు: పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సక్రమంగా దాఖలు చేయాలని ఆ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డి.రాజు సూచించారు. బుధవారం ఆయన వివరాలు తెలుపుతూ భారత ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం నామినేషన్లు ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన, 29న మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉపసంహరణ ఉంటుందని వెల్లడించారు. అదే రోజు సాయంత్రం తుది జాబితా ప్రకటిస్తామన్నారు. నామినేషన్ పత్రాలు సమర్పించే అభ్యర్థులు అఫిడవిట్‌తో పాటు పూర్తి సమాచారం పొందుపర్చాలని చెప్పారు. ఇతరులు రూ. 10 వేలు, ఎస్సీ, ఎస్టీ కులాల అభ్యర్థులు రూ. 5 వేలు డిపాజిట్ చెల్లించాలని అన్నారు. నామినేషన్‌లు దాఖలు చేసే సమయంలో అభ్యర్థులు విధిగా ఎన్నికల సంఘం నియమావళిని పాటించాలని పేర్కొన్నారు.

గన్నవరం: నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంలోని తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల్లో పోటీచేసే ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. నోటిఫికేషన్ విడుదల అనంతరం ప్రారంభమయ్యే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 25వ తేదీతో ముగియనుంది. మే 13వ తేదీన పోలింగ్, జూన్ 4న ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ పూర్తిచేసి ఫలితాలు వెల్లడించనున్నారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తహసీల్దారు కార్యాలయ పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



మద్దూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి జోగి రమేష్ సతీమణి శకుంతలాదేవి

కంకిపాడు: పేదల మంచి కోరే సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ సతీమణి శకుంతలాదేవి విజ్ఞప్తి చేశారు. కుమార్తె రేష్మప్రియాంకతో కలిసి మండలంలోని మద్దూరు గ్రామంలో మంగళవారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతీ గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ హయాంలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. శకుంతలాదేవి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నారని అన్నారు. సంక్షేమాన్ని ప్రతి గడపకూ తీసుకొచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను గ్రామాలకు తెచ్చారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, పెనమలూరు నియోజకవర్గ ప్రజలు తమ రెండు ఓట్లనూ ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిప్పల రామదాసు, ఉపసర్పంచ్ పి.రవి, ఉమెన్‌ఫైనాన్స్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్లు నందిపాటి బిందుమాధవి, రామినేని రమాదేవి, కోలవెన్ను ఎంపీటీసీ సభ్యురాలు తోకల ఉమాదేవి, కుందేరు ఉపసర్పంచ్ మార్తమ్మ, జోజ్‌మేరీ, పార్టీ గ్రామ అధ్యక్షుడు పి.ఆంజనేయులు, స్థానిక నాయకులు నాగార్జున, మోహన్‌రావు, సాంబశివరావు, విజయకుమారి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న 16 మంది అరెస్టు

పెనమలూరు: పోరంకి గ్రామంలోని అపార్టుమెంట్‌లో పేకాట ఆడుతున్న 16 మందిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్ఐ శేషుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం పోరంకి శ్రావణ ఎన్‌క్లేవ్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు అపార్టుమెంట్‌పై దాడి చేశారు. పేకాట ఆడుతూ 16 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. వారి నుంచి రూ. 54,300 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

మినీ ఫ్లై ఓవర్

ఎయిర్‌పోర్ట్‌కు మణిహారం



పూర్తయిన మినీ ఫ్లై ఓవర్



మినీ ఫ్లై ఓవర్‌పై రెండు లైన్ల రహదారి

గన్నవరం: చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారిపై కేసరపల్లి వద్ద నిర్మించిన మినీ ఫ్లై ఓవర్ విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)కు మణిహారంలా నిలిచింది. సుమారు రూ.24 కోట్లతో చేపట్టిన మినీ ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి చేసుకుని వాహనాల రాకపోకలకు సిద్ధమైంది. కేసరపల్లి నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఎన్‌హెచ్ఏఐ ఈ మినీ ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టింది. 1,400 మీటర్లు పొడవున్న ఫ్లై ఓవర్‌ను కాంట్రాక్ట్ సంస్థ రెండేళ్లలో పూర్తిచేసింది. భూమి సేకరించకుండా జాతీయ రహదారి స్థలంలోనే వంతెన నిర్మాణాన్ని ఎన్‌హెచ్ఏఐ అధికారులు పూర్తిచేయడం ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత.

వాహనాల రాకపోకలు సులభతరం

16వ నంబర్ జాతీయ రహదారిపై ఏలూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే మార్గంలో రెండు లైన్లుగా ఈ మినీ ఫ్లై ఓవర్‌ను నిర్మించారు. ఈ వంతెన విమానాశ్రయానికి రాకపోకలు సాగించే వాహనాలకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఎయిర్‌పోర్ట్‌కు వీఐపీలు వచ్చి వెళ్లే సమయంలో వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు చెక్ పడనుంది. విజయవాడ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వచ్చే వాహనాల కోసం అండర్ పాస్‌కు సమీపంలో ప్రత్యేక మార్గం ఏర్పాటు చేశారు. ఫ్లై ఓవర్‌పైనే కాకుండా రోడ్డుకు రెండు వైపులా కాంతివంతమైన ఎల్ఈడీ స్ట్రీట్ లైట్లను అమర్చారు. ప్రయాణికుల కోసం ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల, ఆర్టీఓ కార్యాలయం వద్ద బస్ షెల్టర్లు నిర్మించారు. అతిత్వరలోనే మినీ ఫ్లై ఓవర్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: గీతాంజలి మ్యూజిక్స్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. డాక్టర్ జయంతి చక్రవర్తి, డాక్టర్ దామోదర గణపతిరావు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సుశీల్ కుమార్, వెంకటేశ్వరరావు, భారతి, సౌజన్య, రూపశ్రీ భక్తి గీతాలతో పాటు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. సంస్థ వ్యవస్థాపకుడు జయంతి చక్రవర్తి సంస్థ భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. డాక్టర్ దామోదర గణపతిరావు మాట్లాడుతూ.. సంస్థ ద్వారా నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, ప్రసూనా రామన్, బి.వీ రఘభద్రరావు పాల్గొన్నారు.